సాక్షి
వికారాబాద్
ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



'స్థానికం'పై ఫోకస్

త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనుండటంతో గ్రామాల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. 9లో▸



క్రీడలతో భవిష్యత్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్బీఓఎల్ ఫ్యాక్టరీ ఎండీ సరళా శ్రీనివాస్ పేర్కొన్నారు. 9లో▸



వరివైపే మొగ్గు

రైతన్నలు ఎక్కువగా వరిపంట వైపే మొగ్గు చూపుతున్నారు. ఇతర పంటల సాగుపై ఆసక్తి చూపడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్: పట్టణంలోని కార్గిల్ కాలనీలో 33 కేవీ విద్యుత్ లైన్ మార్పు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు(5గంటల పాటు) సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కొడంగల్, పెద్దనందిగామ, రావులపల్లితో పాటు టేకుల్ కోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో కూడా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

ధారూరు మార్కెట్‌కు 1,223 సంచుల వడ్లు రాక

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం సోనా రకం వడ్లు 1,223 సంచులు వచ్చాయని మార్కెట్ కమిటీ సిద్దమ్మ తెలిపారు. క్వింటాలుకు తక్కువగా రూ.2,400, మధ్యస్తంగా రూ.2,500, అత్యధికంగా రూ.2,630 వరకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. కందులు 380 సంచులు వచ్చాయని, తక్కువగా క్వింటాలుకు రూ.8,050, మధ్యస్తంగా రూ.8,150, అత్యధికంగా రూ.8,210 వరకు ధర పలికిందని పేర్కొన్నారు. అలాగే వరిలో 1010 రకం వడ్లు 165 సంచులు వచ్చాయని తెలిపారు. క్వింటాలుకు తక్కువగా రూ.2,200, మధ్యస్తంగా రూ.2,260, అత్యధికంగా రూ.2,280 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె తెలిపారు.

'రేషన్' అందరికీ అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందేలా చూడాలని తహసీల్దార్ విజయ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ సరుకుల పంపిణీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో డీఈఓ తనిఖీలు



మద్దూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిస్టర్లు, వంటగది, ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఈఓ వెంట ఎంఈఓ సర్దార్ నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాలనలో.. బాద్‌షా



రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారిన జిల్లా

రెండు ప్రధాన పదవుల్లో మన నేతలే..

- కొందరికి చేదు.. మరికొందరికి తీపి జ్ఞాపకాలు మిగిల్చిన 2024
- సీఎం రేవంత్ చొరవతో జిల్లాలో బలపడిన కాంగ్రెస్
- ఎంపీ స్థానంలో కొండా గెలుపుతో పుంజుకుంటున్న బీజేపీ
- అన్ని స్థానాల్లో ఓడినా తగ్గేదేలేదంటున్న బీఆర్‌ఎస్
- పొలిటికల్ రౌండప్

వికారాబాద్: జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం పీఠాన్ని అధిష్టించడంతో జిల్లాలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గతంలో జిల్లా వాసి మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేయగా.. సీఎం రేవంత్ రూపంలో ఆ పదవి రెండో సారి జిల్లాను వరించింది. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించారు. ఆ హోదాలో జిల్లాలో ప్రచారం చేశారు.. పార్టీ గెలవడం ఖాయం.. గెలిచాక జిల్లాకు అత్యుత్తమ పదవి దక్కడం ఖాయమని.. తానే సీఎం అవుతానంటూ పరోక్ష సంకేతాలు ఇవ్వడంతో హస్తం పార్టీ ఒక్కసారిగా పుంజుకొని విజయ దుందుబి మోగించింది. సీఎం పదవి జిల్లానే వరిస్తుందని భావించిన ప్రజలు నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌ను ఆదరించి పట్టం కట్టారు. దీంతో జిల్లాలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. పోటీ చేసిన అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ తుడిచి పెట్టుకుపోయింది. జిల్లాకు మొదటి సారి కీలక పదవులు వరించాయి. చేవెళ్ల ఎంపీగా కమలం పార్టీ జయకేతనం ఎగురవేయడంతో జిల్లాలో ఆ పార్టీ క్రమంగా బలపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చేదుఅనుభవాన్ని మూటగట్టుకున్నా బీఆర్‌ఎస్ నేతల్లో మార్పు కనిపించడంలేదు. నేతల మధ్య విభేదాలు తగ్గడం లేదు..

సంప్రదాయానికి విరుద్ధంగా..

స్పీకర్ వ్యవహారం సంప్రదాయానికి విరుద్ధంగా తయారైందని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. రాజ్యాంగ బద్ధమైన, గౌరవప్రదమైన పదవిలో ఉన్న ఆయన పార్టీ సమావేశాలు, కార్యకలాపాల్లోనూ పాల్గొనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు సీఎం సోదరుడి వ్యవహారం కూడా విమర్శలకు తావిస్తోంది. ఆయనకు ఎలాంటి పదవి లేకపోయినప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం, అధికారులు ఆయనకు ఎదురెళ్లి స్వాగతం పలకడం వంటివి ప్రొటోకాల్ వివాదాలకు తావిస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హస్తం గూటికి చేరారు. ఆయన చేరిక అధికార పార్టీలోకి వచ్చింది మొదలు అటూ భీంభరత్ వర్గానికి కాలె యాదయ్యతో పాటు అధికార పార్టీలో చేరిన నేతలకు పొసగటంలేదు. మరోవైపు స్పీకర్ ప్రసాద్ కుమార్ సొంత నియోజకవర్గంలోనూ యాదయ్య తలదూరుసుస్తున్నాడని స్పీకర్ వర్గం ఆరోపిస్తోంది. ఇక మరో నేత తాండూరు ఎమ్మెల్యే సైతం తాను ప్రాతినిథ్యం వహిస్తున్న తాండూరుతో పాటు పరిగి రాజకీయాల్లోనూ తలదూరుస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. ఆయన తాండూరు ఎమ్మెల్యేగా ఉంటూనే సొంత నియోజకవర్గం పరిగిలోనూ సొంత వర్గాన్ని పెంచి పోశిస్తున్నారని పరిగి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ వర్గీయులు పేర్కొంటున్నారు. ఇక మరో ముఖ్యనేత పట్నం మహేందర్‌రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్‌గా మంచి హోదాలో ఉన్నప్పటికీ తన సొంత నియోజకవర్గంగా బావించే తాండూరులో తన పట్టు కోల్పోతున్నారనే భావన ఆయన క్యాడర్ వ్యక్తం చేస్తుంది.



బీఆర్‌ఎస్‌కు చేదు అనుభవం

జిల్లాకు చెందిన నలుగురు కాంగ్రెస్ నేతలను కీలక పదవులు వరించగా.. బీఆర్‌ఎస్ నేతలకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదనే చెప్పవచ్చు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. చివరకు ఆమెను రేవంత్‌రెడ్డి సిట్టింగ్ సీటు అయిన మల్కాజ్‌గిరి సీటు ఇచ్చి పోటీ చేయించగా బీజేపీ నేత ఈటెల రాజేందర్ చేతిలో ఓటమిపాలయ్యారు. పరిగి నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి పోర్టుపోలియో ఆశించారు. ఇందుకోసం తీవ్రంగా ప్రయత్నించినా జిల్లాకు చెందిన వ్యక్తులే సీఎంగా, స్పీకర్‌గా ఉండటంతో అమాత్య పదవి దక్కలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గూటికి చేరిన చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి అధికార పార్టీ తరఫున పోటీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎంపీగా ఉంటూ జిల్లా మీద పట్టు సాధించిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించుకోలేక చితికిల పడగా ఎంపీగా తాను కూడా ఓటమిపాలవడంతో ఇప్పుడు జిల్లాకు చుట్టపుచూపుగా కూడా రావడం లేదు.



జిల్లా నేతలకు కీలక పదవులు

ఈ ఏడాది జిల్లాని కాంగ్రెస్ నేతలకు కలిసొచ్చిందనే చెప్పాలి. గతంలో ఎప్పుడూ లేని విధంగా పదవులు వరించాయి. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముందుగా ఊహించినట్టుగానే సీఎం పీఠాన్ని అధిష్ఠించారు. వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సభాపతి పదవి వరించింది. ఇక జిల్లాకు చెందిన మరో ముఖ్య నేత పట్నం మహేందర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే కారు పార్టీ దిగి హస్తం గూటికి చేరారు. దీంతో ఆయనకు మండలి చీఫ్‌విప్ పదవి వరించింది. మరో నేత కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఎన్నికలకు ముందు గులాబీ పార్టీని వీడికి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ పదవి దక్కింది.

బీఆర్‌ఎస్‌లో తగ్గని గిల్లికజ్జాలు

బీఆర్‌ఎస్‌లో సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లా అధ్యక్షుడు సహా నలుగురు ఎమ్మెల్యేలు ఓటమిపాలయ్యారు. అయినా ఆ పార్టీలో గిల్లి కజ్జాలు తగ్గటంలేదు. పార్టీ సమావేశం జరిగిన ప్రతిసారీ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం పరిపాటిగా మారింది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అధికారులపై హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లటం జిల్లా రాజకీయాల్లో మరింత వేడి పుట్టించింది.. బీఆర్‌ఎస్ సమావేశాల్లో ఆయన పేరు తీయకపోవడం పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెట్టింది.

బలపడుతున్న బీజేపీ..

ఎంపీ స్థానం గెలుచుకోవటం బీజేపీకి బలాన్నిచ్చింది. ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. దీంతో అడపా దడపా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. అవకాశం వచ్చిన ప్రతి చోటా ప్రజల తరఫున గళం విని పిస్తున్నారు. వామపక్షాలు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వారితో జగకట్టడం.. ఇప్పుడు అధికార కాంగ్రెస్‌తో కొనసాగుతుండటంతో ప్రజలు నమ్మడం లేదనే చెప్పవచ్చు.



శిథిలావస్థకు చేరిన బురుజు

ఊరు మాయం.. పేరు పదిలం!

సండే స్పెషల్

కొడంగల్ మండలం టేకుల్‌కోడ్ పంచాయతీకి అనుబంధంగా ఉండేది గండ్లపల్లి గ్రామం. చుట్టూ ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతం. రాళ్ల గనులు, పచ్చని పంట పొలాలతో కళకళలాడేది. నాపరాతి గనులు అధికంగా ఉండటంతో ఈ ఊరిని 'గనుల పల్లి' అని పిలిచేవారు. వ్యవసాయ పనులు లేని సమయంలో.. ఇక్కడి ప్రజలు గనుల్లోని రాళ్లను తవ్వి జీవనం సాగించేవారు. గనులపల్లి కాల క్రమేణా గండ్లపల్లిగా మారింది. సీన్ కట్ చేస్తే.. రెండు వందల ఏళ్ల క్రితం ఈ ఊరిని మహమ్మారి (అంటువ్యాధి) ఆవరించింది. అంతుచిక్కని గత్తర (రోగం) ప్రాణాలను కబళించసాగింది. బతుకు జీవుడా అంటూ ప్రజలంతా వలస వెళ్లడంతో గ్రామం పూర్తిగా కనుమరుగైనా.. రికార్డుల్లో పేరు ఇప్పటికీ కొనసాగుతోంది. – కొడంగల్

వివరాలు 8లో▸

కాలగర్భంలో కలిసిన గండ్లపల్లి

- గత్తరతో గ్రామం ఖాళీ
- రెండు శతాబ్దాల క్రితం కనుమరుగు
- పక్క ఊళ్లకు వెళ్లి అక్కడే స్థిరపడిన స్థానికులు
- క్షేత్రస్థాయిలో ఊరు లేకపోయినా.. అదే పేరుతో రెవెన్యూ రికార్డులు
- చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న శిథిలాలు

భూ సర్వేకు సన్నాహాలు



హకీంపేట్ రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

- హకీంపేట్ రైతులతో సమావేశం
- 31 నుంచి ప్రక్రియను ప్రారంభిస్తాం: తహసీల్దార్ కిషన్

దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా భూ సర్వేకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం హకీంపేట్ రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశమయ్యారు. హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో భూ సర్వే చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ.. హకీంపేట్ పరిధిలోని 351 ఎకరాల అసైండ్ భూములకు గాను సర్వే చేయనున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా రైతులు పొజిషన్‌లో ఉన్నారా లేదా అనే విషయాలు గుర్తిస్తామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని, సర్వే సమయంలో అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. పట్టా పాసుపుస్తకాలు ఉన్న చాలా మంది రైతులు పొజిషన్‌లో లేదని తెలిపారు. సర్వే చేస్తే అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐ నవీన్, సర్వేయర్ మహేశ్, రికార్డ్ అసిస్టెంట్ ఊశప్ప తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు.. గోవిందా !

- అంగన్‌వాడీ కేంద్రాలకు 45 రోజులుగా సరఫరా నిలిపివేత
- ఇండెంట్ పెట్టినా పంపిణీ చేయని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందని పౌష్టికాహారం

బషీరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు దాదాపు 45 రోజులుగా కోడిగుడ్లు సరఫరా కావడం లేదు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వడం లేదు. జిల్లాలోని అన్ని సెంటర్లకు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గుడ్లను సరఫరా చేస్తారు. ప్రతి నెలా రెండు పర్యాయాలు (మొదటి.. మూడో వారంలో) పంపిణీ చేస్తుంటారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ నెల వరకు అంగన్‌వాడీలు ఎస్‌హెచ్‌టీఎస్ యాప్‌లో ఇండెంట్ అప్‌లోడ్ చేశారు. కానీ కేంద్రాలకు గుడ్లు సరఫరా కాలేదు. ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్లు, క్షేత్రస్థాయి అధికారులను వివరణ కోరగా.. పై నుంచి సరఫరా కాలేదు.. మేమేం చేసేది అని బదులిచ్చారు. కేంద్రాల్లోని ప్రీ స్కూల్ పిల్లలకు నెలన్నరగా గుడ్డు లేకుండా భోజనం పెడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ప్రతి నెలా 5 నుంచి 8 లక్షల వరకు గుడ్లను సరఫరా చేస్తారు. 45 రోజులుగా సరఫరా కాకపోవడంపై ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా అయ్యేలా చూడాల్సిన బాధ్యత జిల్లా శిశుసంక్షేమ అధికారిపై ఉంటుంది. అయితే కార్యాలయంలో పని చేసే ఓ చిరుద్యోగి ఈ వ్యవహారం చూడటం వల్లే సరఫరా కాలేదని తెలిసింది. అలాగే 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు టీహెచ్‌ఆర్ (టేక్ హోం రేషన్) కింద ప్రతి నెలా 2.5 కిలోల బాలామృతం, 16 గుడ్లు అందకుండా పోయాయి.

'ఆరోగ్యలక్ష్మి'దీ ఇదే పరిస్థితి

గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజు గుడ్డు, 200 ఎంఎల్ పాలు, అన్నం, కూరగాయలతో భోజనం వండి పెడతారు. వీరికి కూడా రెండు నెలల నుంచి గుడ్డులేని ఆహారం ఇస్తున్నారు.



చిన్నారికి వడ్డించిన గుడ్డులేని భోజనం

బిల్లులు చెల్లించం



ఎక్కడో పొరపాటు జరగడం వలన అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరా నిలిచిపోయింది. ప్రతి నెలా సక్రమంగా సరఫరా చేయాలని పౌల్ట్రీఫాం కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశాం. ఒకసారి చిన్న సైజు గుడ్లు తెస్తే వెనక్కు పంపారు. అన్ని సెంటర్ల నుంచి సకాలంలో ఇండెంట్ అందినా సరఫరా కాలేదు. అంగన్‌వాడీ టీచర్లు బయోమెట్రిక్ ద్వారానే గుడ్లను డ్రా చేస్తారు. ఇందులో అక్రమాలకు చోటులేదు. నెలన్నరగా గుడ్లు సరఫరా కాలేదు.. కాబట్టి వాటి బిల్లులు కూడా చెల్లించలేదు. చలికాలంలో పౌల్ట్రీలో గుడ్ల ఉత్పత్తి తగ్గడం వలన సరఫరా కాలేదని కాంట్రాక్టర్ చెప్పారు. ఇకనుంచి సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం. గడిచిన రోజులకు గుడ్లు ఇవ్వడం కుదరదు.

– కృష్ణకుమారి, డీడబ్ల్యూఓ

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదని ఆదేశం

అనంతగిరి: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం భూ లభ్యత, పాత ధాన్యం సేకరణ, ధాన్యం నిల్వ చేసిన భవనాలు, ధరణి పెండింగ్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ధరణిలో ఎలాంటి పెండింగ్ ఉండరాదన్నారు. పీహెచ్‌సీల కోసం గుర్తించిన భూముల వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. విద్యుత్ సబ్ స్టేషన్ కోసం వచ్చిన దరఖాస్తును తమకు పంపాలని సూచించారు. పాఠశాలలకు పంపే బియ్యం, బియ్యం నిల్వ గోదాములను, రేషన్ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఫిబ్రవరి ఒకటిలోపు దరఖాస్తు చేసుకోవాలి

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి ఒకటవ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 సంవత్సరం 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాలని తెలిపారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు సాధ్యం కాకుంటే స్థానికంగా ఉండే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కులం, ఆదాయం, పుట్టిన తేదీ ధ్రువ పత్రాలు, ఆధార్ నంబర్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి పరీక్షలకు విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకుల పాఠశాలల్లో 5నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 23న పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ఏడుగురిపై కేసు

అనంతగిరి: ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధన్నారం సమీపంలో ఎర్రమట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో రెండు లారీలు, ఒక టిప్పర్, ఒక జేసీబీని సీజ్ చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వికారాబాద్ ఠాణాలో కేసు నమోదు చేశారు. అక్రమాలను అరికట్టేందుకు 8712670022 నంబర్‌కు సమాచారం అందించాలని టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మల్లేశ్(ఫైల్)

దోమ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గొడుగోనిపల్లికి చెందిన చెక్కలి మల్లేశ్(28) కుటుంబ తగాదాలతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన మల్లేశ్ ఇంట్లోని రేకుల రాడ్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ ఆనంద్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- రెండు తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.3లక్షల నగదు అపహరణ

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేశారు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్, బాధితులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్‌లో నివసిస్తున్న వీరయ్య శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం తాళం తెరిచి ఉండడం గమనించిన పొరుగింటి వారు వీరయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులతో ఇంటికి వచ్చిన వీరయ్య ఇంట్లోని రెండు తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ కార్మికుడి బలవన్మరణం


మహ్మద్ వసీం (ఫైల్)

పహాడీషరీఫ్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ సెంట్రింగ్ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బాలాపూర్ ఠాణా పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం.. వాదే సాల్హెహీన్ బస్తీకి చెందిన మహ్మద్ వసీం(30) సెంట్రింగ్ కార్మికుడు. ఇటీవల తాగుడుకు బానిసవ్వడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు రేకుల పైప్‌నకు చీరతో ఉరేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇదే విషయమై వసీం భార్య హాజీరా ఫాతిమా మాట్లాడుతూ.. మూడురోజుల క్రితం తనను ఇంటి నుంచి గెంటేస్తే పిల్లలతో కలిసి చాంద్రాయణగుట్టలో పుట్టింటికి వెళ్లానని.. శుక్రవారం అక్కడకు వచ్చి కూడా తనపై చేయి చేసుకున్నాడన్నారు. జమాత్‌లో కలిసి సాయంత్రం విడాకులకు సంబంధించి తలాక్ చెబుతానని చెప్పి వెళ్లిపోయాడన్నారు. తాగిన మత్తులో గతంలో చేతులు కోసుకున్నాడని వెల్లడించింది. కాగా వసీం ఆత్మహత్యకు భార్య కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారి వేధింపులు తమకు చెప్పుకొని బాధపడేవాడన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఊరు మాయం పేరు పదిలం!

సండే స్పెషల్

కొడంగల్: పురాతన చరిత్ర కలిగిన గండ్లపల్లి కాలగర్భంలో కలిసిపోయింది. గిరిజన ప్రజలు నివసించే ఈ ఊరిలో సుమారు వందమందికి పైగా జనాభా ఉండేది. ప్రాణాంతక వ్యాధి సోకడంతో పదుల సంఖ్యలో స్థానికులు మృత్యువాత పడ్డారు. దీంతో భయపడిన గ్రామస్తులు కుటుంబాలుగా విడిపోయి, సమీప గ్రామాలకు వలస వెళ్లారు. అలా వెళ్లిన వారు అక్కడే స్థిరపడిపోయారు.

ఆవాసాలు నేలమట్టం

కొడంగల్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండ్లపల్లి ప్రస్తుతం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రజలంతా గ్రామాన్ని వదిలి వెళ్లడంతో గుడిసెల మాదిరిగా ఉండే ఆవాసాలు నేలమట్టమయ్యాయి. గ్రానైట్, నాపరాయితో పటిష్టంగా నిర్మించిన ఆలయాలు, బురుజులు మాత్రం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

ఆలయాలు, బురుజులు


గండ్లపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం

గండ్లపల్లి శివారులోని బురుజులు నాటి గుర్తులకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. బురుజులో ఊరడమ్మ ఆలయం ఉంది. ఇందుకు సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గండ్లపల్లితో పాటు సమీప గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి పూజలు చేసేవారని తమ పెద్దలు చెప్పినట్లు వృద్ధులు పేర్కొంటున్నారు. దీనికి సమీపంలోనే


గండ్లపల్లి గ్రామానికి చెందిన భూములు

ఆంజనేయస్వామి ఆలయం ఉంది. పూర్తిగా శిథిలమైన ఈ ఆలయాల్లోకి వెళ్లేందుకు ఇప్పటికీ ఎవరూ సాహసించరు.

శివారు గ్రామాల్లో స్థిర నివాసం...

మహమ్మారి బారినుంచి ప్రాణాలు దక్కించుకునేందుకు ప్రజలంతా తమ పిల్లాపాపలు, పెంపుడు జంతువులను తీసుకుని పక్క గ్రామాలకు పయనమయ్యారు. శివారు గ్రామాలైన ధర్మాపూర్, టేకుల్‌కోడ్ వెళ్లి తలదాచుకున్నారు. కొన్నాళ్ల తర్వాత అక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

అప్పట్లో వందకు పైగా జనాభా...

రెండు శతాబ్దాల క్రితం గండ్లపల్లిలో 115 మంది గిరిజనులు జీవించేవారు. అందులో స్త్రీలు 53 మంది, పురుషులు 62 మంది ఉండేవారు. వీరిలో 106 మంది నిరక్షరాస్యులే. 22 నివాస గృహాల్లో జీవించినవారంతా ప్రేమానురాగాలతో కలిసిమెలిసి ఉండేవారు. గ్రామ విస్తీర్ణం 1,142 హెక్టార్లుగా నమోదై ఉంది.

కొనసాగుతున్న 'వారసత్వం'

గ్రామానికి చెందిన పూర్వికుల నుంచి తరతరాలుగా వారి వారసులకు భూములు సంక్రమిస్తున్నాయి. వందల ఏళ్లుగా పక్క గ్రామాల్లో స్థిరపడిపోయిన వీరి పొలాలు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో గండ్లపల్లి పేరుతోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో కూడా గండ్లపల్లి పేరుమీదే భూముల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి.


ధరణిలో గండ్లపల్లి పేరుమీద ఉన్న పాస్‌బుక్కు

సరిహద్దులివే..

గండ్లపల్లి గ్రామానికి దక్షిణాన దౌల్తాబాద్ మండలం, తూర్పున బొంరాస్‌పేట మండలం, ఉత్తరాన యాలాల మండలం, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రం ఉంది.

ధర్మాపూర్‌లో స్థిరపడ్డాం



మా తాతల కాలంలో ఊరును ఖాళీ చేశారు. అప్పట్లో విష జ్వరాలు రావడం వల్ల ఊరి జనమంతా శివారు గ్రామాలైన ధర్మాపూర్, టేకుల్‌కోడ్ వెళ్లి స్థిరపడ్డారు. మా తాత తన పిల్లలతో కలిసి ధర్మాపూర్ వచ్చేశారు. మా భూములు ఇప్పటికీ గండ్లపల్లి పేరుతోనే ఉన్నాయి. – సాయప్ప, ధర్మాపూర్

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో..

రైళ్లలో విస్తృత తనిఖీలు

- వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో గోవా నుంచి తరలిస్తున్న 95 మద్యం బాటిళ్లు సీజ్
- తాండూరు ప్లాట్‌ఫాంపై 12 కిలోల గంజాయి స్వాధీనం

తాండూరు టౌన్: న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వికారాబాద్, తాండూరు రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యంతో పాటుగా.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పురస్కరించుకుని గంజాయి, డ్రగ్స్, మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందని.. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి గోవా నుంచి వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలులో వికారాబాద్ వద్ద తనిఖీలు నిర్వహించగా రూ.లక్షల విలువైన 95 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. శనివారం మధ్యాహ్నం భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు తనిఖీల్లో నిషేధిత పదార్థాలు ఏమీ లభ్యం కాలేదన్నారు. తాండూరు రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్‌ఫాం పై ఆరు బ్యాగుల్లో రూ.లక్షల విలువైన 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఎవరూ పట్టుబడలేదని.. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, వికారాబాద్ ఎస్‌ఐ వీరాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.


వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలులో స్వాధీనం చేసుకున్న గోవా మద్యం బాటిళ్లు

మన్మోహన్ సింగ్ మృతి తీరనిలోటు


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీంరెడ్డి తదితరులు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: ఆర్థిక సంస్కర్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని.. ఆయన మృతి దేశానికి తీరని లోటు అని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పాంబండ ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్, బ్లాక్‌-2 అధ్యక్షుడు భరత్, పీఏసీఎస్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, రజక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్, యూత్ వింగ్ అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


ధారూరు పీఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- మద్యం, డీజేలపై నిషేధాజ్ఞలు
- వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు: కొత్త సంవత్సరం వేడుకుల సంబంధించి ఫాంహౌస్‌లు, రిసార్టులు అనుమతులు తప్పక తీసుకోవాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ధారూరు సర్కిల్ కార్యాలయం, ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి గతేడాది.. ఈ ఏడాది నమోదైన కేసులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఫాంహౌస్‌ల్లో, రిసార్ట్‌ల్లో మద్యం సేవించడం, డీజేలు ఉపయోగిస్తే ఉపేక్షించమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ రఘురాం, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌కు సూచించారు. సీఐ, ఎస్‌ఐలు డీఎస్పీకి మొక్కలు అందజేశారు. ఈ మొక్కలను స్టేషన్ ఆవరణలో నాటి నీరుపోశారు.

అనుమానాస్పద స్థితిలో పోస్ట్‌మన్ మృతి


అంజిలయ్య మృతదేహం



(ఫైల్)

తాండూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో ఓ పోస్ట్‌మన్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తాండూరు–నారాయణపూర్ మార్గాల మధ్యనున్న పట్టాలపై మృతదేహం పడిఉన్నట్లు శనివారం ఉదయం సమాచారం అందింది. ఈ మేరకు అక్కడకు వెళ్లి చూడగా జినుగుర్తికి చెందిన పోస్ట్‌మన్ జనుముల అంజిలయ్య(53) గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అంజిలయ్యకు భార్య సుశీలమ్మ, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని సుశీలమ్మ ఫిర్యాదు చేసింది.

భర్త మృతిపై అనుమానం: సుశీల


శుక్రవారం చిన్న కుమారుడితో కలిసి తాండూరు బ్రాంచ్ పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ఆసరా పెన్షన్ తీసుకుని డబ్బులు, సెల్‌ఫోన్ ఇంటికి పంపి తను రాలేదు. అదే రోజు సాయంత్రం ఓ పోస్ట్‌మన్, అతని స్నేహుడితో కలిసి బంగారం వైన్స్‌లో మద్యం సేవించినట్లు తెలిసిందని చెప్పారు. ఉదయం రైల్వే పోలీసులు మృతి చెందిన విషయం తెలియజేశారు. తన భర్తతో ఇంటి సమీపంలోని ముగ్గురు వ్యక్తులతో పాటుగా ఓ పోస్ట్‌మన్ తరచూ గొడవపడేవారని.. భూమి పంచాయతీలున్నాయని.. వీరిపై అనుమానం ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు చెప్పారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం


అదృశ్యమైన తల్లీపిల్లలు

హయత్‌నగర్: ఇద్దరు పిల్లలతో కలిసి ఓ తల్లి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూరు గ్రామం రాజీవ్ గృహకల్ప కాలనీలో మహబూబ్ అలీఖాన్ తన భార్య సహజా బేగం కొడుకు సల్మాన్‌ఖాన్, కూతురు ఆఫ్రిన్ బేగంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 22న మహబూబ్ అలీఖాన్ తన పనికోసం వెళ్లి 23న తిరిగి వచ్చే వరకు భార్యా పిల్లలు కనిపించలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పనికి వెళ్లిన యువతి


సంధ్య(ఫైల్)

మొయినాబాద్: పనికి వెళ్తున్నాని చెప్పి ఇంటినుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దర్గ సంధ్య(22) గండిపేట చౌరస్తా వద్ద ఉన్న ఓ కళాశాలలో జాబ్ చేస్తుంది. రోజు మాదిరిగానే శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తున్నాని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పనిచేసే చోట, పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితులు వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శనివారం మొయినాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెలూన్ నిర్వాహకుడు..


దీపక్ కుమార్ (ఫైల్)

శంకర్‌పల్లి: మోకిల పీఎస్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(23) మూడేళ్ల క్రితం మోకిలకు వచ్చాడు. తన అక్క, బావ ఇంట్లోనే ఉంటూ ఓ కటింగ్‌షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం షాప్‌నకు వెళ్లిన దీపక్ సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో ఆయన అక్కబావలు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం దీపక్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

స్కాలర్‌షిప్ గడువును పొడగించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్


బంట్వారం: బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్ గడువును మార్చి వరకు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకే గడువు ఉందని.. ఇప్పటికీ 50శాతం మంది విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఇదే విషయమై తాను బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్‌ను కలిసి వివరించామన్నారు. గడువు సమయం తక్కువగా ఉండడంతో వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దూరమయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మార్చి వరకు గడువును పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేయాలి

చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కమిటీ చైర్మన్ వెంకటేశం

అనంతగిరి: ఆడపిల్లల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశం అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు సమానత్వ కమిటీ యువసమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశం మాట్లాడుతూ.. బాలికల స్వతంత్రత కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకుని సమస్యలపై పోరాడడం అభినందనీయమన్నారు. లింగ సమానత్వం రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కు అన్నారు. ఉన్నత విద్యతోనే లింగ బేధం రూపుమాపవచ్చాన్నారు. అనంతరం ఎస్‌ఐ విమల మాట్లాడుతూ.. సమాజంలో మనమే అవకాశాలను సృష్టించుకోవాలన్నారు. ఎంవీఎఫ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటస్వామి, తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమితి రాష్ట్ర నాయకులు కృప, జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు వనమాల, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాజునాయక్, రాందాసు, ఉంవీఎఫ్ ప్రతినిధులు శ్రీనివాస్, ఆశ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రాజునాయక్‌కు డాక్టరేట్



యాచారం: మండల పరిధిలోని బొలిగుట్టతండాకు చెందిన వడ్త్యా రాజునాయక్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవలను గుర్తించిన ఆస్య ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం తమిళనాడులోని హోసూర్‌లో అవార్డుతో సత్కరించింది. గతంలో నందివనపర్తి సర్పంచ్‌గా పనిచేసిన రాజునాయక్ కోవిడ్ సమయంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేదలకు ఉచితంగా బియ్యం, వంట సరుకులు పంపిణీ చేశారు. ఆయన సతీమణి రజిత ఎంపీపీగా పనిచేశారు.

జీపును ఢీకొట్టిన కారు

పలువురికి గాయాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రులు

మంచాల: కార్మికులతో ప్రయాణిస్తున్న జీపును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని ఎల్లమ్మ తండా సమీపంలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన ప్రకారం.. ఎల్లమ్మ తండాకు చెందిన కార్మికులు కట్టె కొట్టే పనులకు వెళ్లి రంగాపూర్ నుంచి జీపులో తిరుగుప్రయాణమయ్యారు. ఎల్లమ్మతండా నర్సరీ సమీపంలోకి రాగానే లోయపల్లి నుంచి ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ కారు జీపు వెనుక భాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబోత్ దస్రూ నాయక్, సపావట్ లచ్చిరాం, సపావట్ బిక్కు నాయక్, సపావట్ హీరాలాల్, రత్లావత్ హీరాలాల్, కొర్ర పాండుతో పాటు కారు డ్రైవర్ కానుగుల శేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మంచాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నకిలీ ఫోన్ పే యాప్‌తో మద్యం కొనుగోళ్లు

- రూ.65వేలకు టోకరా
- నలుగురు మైనర్లను పట్టుకున్న ఎస్‌ఓటీ పోలీసులు
- సైబర్ క్రైం కేసు నమోదు

చేవెళ్ల: నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం చేస్తున్న నలుగురు మైనర్లను ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకుని చేవెళ్ల స్టేషన్‌లో అప్పగించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. శనివారం కేసు వివరాలను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వెల్లడించారు. నలుగురు మైనర్లు చేవెళ్లలోని దుర్గా వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి ఫేక్ ఫోన్‌పే యాప్‌తో డబ్బులు చెల్లించినట్లు చూపారు. కౌంటర్‌లో డబ్బు తక్కువగా వస్తుందని గుర్తించిన యజమాని సీసీ కెమెరాలను పరిశీలించారు. కొందరు వ్యక్తులు కౌంటర్ బిజీగా ఉన్న సమయంలో తరచూ వస్తుండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు వారిని పట్టుకుని చేవెళ్ల స్టేషన్‌లో అప్పగించారు. వారిపై సైబర్‌క్రైం కేసు నమోదు చేశారు. వీరు కొన్ని రోజులుగా రూ.65వేల మద్యం కొనుగోళ్లు చేసినట్లు గుర్తించారు. ఈ ఫేక్‌ఫోన్‌పే యాప్ ఎలా వచ్చింది? ఎవరు ద్వారా తీసుకున్నారు? ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. రూ.3.5 లక్షల నష్టం


ఐదు రోజులుగా టవర్ వద్దే డీసీఎం.. పక్కనే కొత్త టవర్ నిర్మాణం

- ఐదు రోజుల క్రితం విద్యుత్ టవర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- వాహనం తొలగిస్తే ప్రమాదమని చెప్పిన ట్రాన్స్‌కో అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యానికి ట్రాన్స్‌కో సంస్థకు రూ.3.5లక్షల నష్టం వాటిల్లింది. ఐదు రోజుల క్రితం ఆదిబట్ల మున్సిపాలిటీ టీసీఎస్ మార్గంలో ఓ డీసీఎం లోడ్‌తో ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో రెడీమిక్స్ ప్లాంట్ వద్దకు రాగానే ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడి తలకు గాయాలవ్వడంతో డ్రైవర్ వాహనం నుంచి దూకి పరారయ్యాడు. దీంతో డీసీఎం అదే వేగంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టంకు సరఫరా అయ్యే 33కేవీ ఎంప్లాస్టిక్ టవర్‌ను ఢీకొట్టింది. ఆ టవర్ దెబ్బతింది. డీసీఎంను తొలగిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెప్పడంతో నూతన స్తంభం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ స్తంభం ఏర్పాటుకు రూ.3.5లక్షలు వెచ్చించాలి. స్తంభాన్ని మార్చిన తర్వాతే డీసీఎంను తొలగించనున్నారు. కాగా క్షతగాత్రుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం


రామ్‌చరణ్

శంషాబాద్ రూరల్: ఫాస్ట్‌ఫుడ్ కేంద్రానికి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... తల్లిదండ్రులు చనిపోవడంతో ఎం.రామ్‌చరణ్(15) మదన్‌పల్లిలో తన మేనమామ శేఖర్ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 26న రాత్రి పక్కింటి నివాసి కె.చంద్రకళ తన కోసం ఫ్రైడ్ రైస్ తీసుకురమ్మని రాంచరణ్‌కు రూ. 100 ఇచ్చి ఫాస్ట్‌ఫుడ్ కేంద్రానికి పంపింది. తర్వాత బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.